క్లుప్తంగా

కబడ్డీలో సెవెన్ ప్లేయర్స్ జట్టు విజయం

రాజోలు: హైదరాబాద్‌లోని పైల్వాన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో రాజోలు సెవెన్ ప్లేయర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు శుక్రవారం జట్టు కోచ్ కట్టా వెంకటశెట్టి, కెప్టెన్ మొగలి వెంకటేష్ వివరాలు తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన 14 కబడ్డీ జట్లు పోటీల్లో పాల్గొన్నాయని, నాక్ అవుట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో అండర్-19 విభాగంలో విజేతగా నిలిచామన్నారు. కోచ్ కట్టా వెంకటశెట్టి, కెప్టెన్ మొగలి వెంకటేష్‌లతో పాటు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను పలువురు అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ మై భారత్ కాకినాడ వారి ఆధ్వర్యంలో ఆక్సిజన్ అసోసియేషన్ సంస్థ సహకారంతో శుక్రవారం మామిడికుదురులో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. బోయి భీమన్న మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు 'పచ్చదనమే పునాదిగా-పచ్చటి భవిష్యత్తు-తల్లి కోసం ఒక చెట్టు' అనే అంశంపై ఈ పోటీలు జరిగాయి. ఆక్సిజన్ అసోసియేషన్ సంస్థ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం మాట్లాడుతూ మొక్కలు పెంచడం, పచ్చదనంపై యువత ఆలోచనా విధానం మరింత మెరుగుపడేందుకు ఈ వ్యాసరచన పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు త్వరలో బహుమతులు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

వేతనాలు చెల్లించకపోతే పనులు నిలుపుదల

సఖినేటిపల్లి: ఉపాధి పనులకు సంబంధించి వేతన బకాయిలు వారం రోజుల్లో చెల్లించని పక్షంలో పనులు నిలుపుదలకు వెనుకాడబోమని సదరు కూలీల సంఘ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మోరిపోడులో ఉపాధి మేట్ మల్లాడి రమాదేవి అధ్యక్షతన ఉపాధి కూలీల సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గత రెండు నెలల నుంచి వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం నుంచి నిధులు విడుదలైనప్పటికీ ఇంత వరకూ కూలీల ఖాతాలకు జమ కాకపోవడం శోచనీయమని అన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కుసుమ రమేష్, పోతాబత్తుల అన్నవరం, గెద్దం దేవీ, పెమ్మాడి సత్యనారాయణ, బుల్లియ్య పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పన

రాజోలు: ప్రయాణికులకు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధనమ్మ తెలిపారు. శుక్రవారం డిపోకు చెందిన బస్సును పూర్తిగా తనిఖీ చేసి రోడ్ టెస్ట్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బస్సు డ్రైవింగ్‌లో ఎలాంటి అవరోధాలు రాకుండా ఉండేందుకు ముందస్తుగా టెస్టులు చేపట్టామన్నారు. ప్రయాణికులకు బస్టాండ్‌లో ఫ్యాన్స్, లైటింగ్, పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చామన్నారు. ప్రయాణికుల సౌకర్యం, క్షేమమే లక్ష్యంగా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు



ఆలమూరులో గ్రంథాలయం తొలి అంతస్తు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు: నేటి సమకాలీన సమాజంలో గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా సేవలను అందిస్తున్నాయని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరులో సుమారు రూ.పది లక్షలతో నిర్మించిన తొలి అంతస్తు భవనాన్ని శుక్రవారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, సర్పంచ్ నేలపూడి లావణ్యతో కలసి ప్రారంభించారు. గ్రంథాలయంలో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాల వివరాలను లైబ్రేరియన్ టి.నమశ్శివాయను అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రంథాలయాలను తప్పనిసరిగా విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు పాల్గొన్నారు.

వినియోగదారుల సంక్షేమానికి కృషి

సఖినేటిపల్లి: వినియోగదారుల సంక్షేమానికి కన్జ్యూమర్ ఫోరం తగిన కృషి చేస్తుందని సంఘ అధ్యక్షుడు, జిల్లా కన్జ్యూమర్ ప్రొటెక్ట్ కౌన్సిల్ మెంబర్ మాలే శ్రీనివాస నగేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన కన్జ్యూమర్ వెల్ఫేర్ సొసైటీ సఖినేటిపల్లి, మలికిపురం మండలాల సమావేశం నిర్వహించారు. నగేష్ మాట్లాడుతూ, విద్యార్థుల హక్కుల రక్షణకు ప్రొటెక్టివ్ కౌన్సిల్ కృషి చేస్తుందన్నారు. ఎంపీపీ మల్లిబాబు మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల నిర్వహణలో వాహనాల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. పరిషత్ ఏఓ సోమేశ్వరి, ఫోరం కార్యదర్శి కోళ్ళ వేణు, సభ్యులు అచ్యుత రామరాజు, ఫిలిప్ రాజు, శివకుమార్, ప్రైవేటు యాజమాన్యాలు, సిబ్బంది, డైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

రైతన్న నడ్డి విరిచిన కూటమి ప్రభుత్వం

- ప్రజలను మోసం చేస్తున్న సీఎం చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు



జి.అగ్రహారంలో చంద్రబాబు మేనిఫెస్టో, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో రైతన్నల నడ్డి విరిచారని, రైతులకు పంట సాయం లేకపోగా కనీసం గిట్టుబాటు ధర కల్పించలేని దుస్థితిలో టీడీపీ ప్రభుత్వం ఉందని జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు విమర్శించారు. గంగలకుర్రు అగ్రహారంలో విత్తనాల ఇంద్రశేఖర్ స్వగృహం వద్ద నియోజకవర్గ పరిశీలకుడు పెన్మత్స చిట్టిరాజు పర్యవేక్షణలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పంట సాయం డబ్బులు వేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందని, కనీసం రైతన్నల కష్టానికి తగ్గ ఫలితంగా గిట్టుబాటు ధరలు కల్పించలేక చేతులెత్తేశారని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాది గడుస్తున్న ఎన్ని హామీలు అమలు చేశారని ప్రశ్నించారు.

చంద్రబాబు మొదటి నుంచి మోసాలతోనే ముఖ్యమంత్రిగా పదవులు చేపట్టారని గుర్తుచేశారు. నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిరాజు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పేరుతో రైతులను, నిరుద్యోగ భృతి ఊసే లేదని, ఉచిత బస్సు పేరుతో మహిళలను మోసం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి మాట్లాడుతూ 2014లో రుణమాఫీ అంటూ రైతులను, పసుపు కుంకుమ అంటూ చంద్రబాబు మోసం చేశారని ఆరోపించారు. అనంతరం బాబూస్ మేనిఫెస్టో రీకాలింగ్ క్యూర్ కోడ్ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో పీకే రావు, మందపాటి కిరణ్‌కుమార్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, పేరి శ్రీనివాస్, కొర్లపాటి కోటబాబు, కోట బేబిరాణి, సూదాబత్తుల రాము, మట్టపర్తి హరి, ఎంఎం శెట్టి, గంటి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



పి.గన్నవరం సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గన్నవరపు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: చంద్రబాబునాయుడు మోసపూరిత వాగ్దానాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు సూచించారు. పోతవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో గన్నవరపు మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం వివరాలను ఆయన పార్టీ శ్రేణులకు వివరించారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు మాట్లాడుతూ చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలని, ఆయన మోసపూరిత వైఖరిని ప్రజలు గ్రహిస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ సీనియర్ నాయకుడు మందపాటి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ఐక్యంగా ఉండి, వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా చేసేందుకు పాటుపడాలని అన్నారు. ఇటీవల పార్టీ పదవులు పొందిన పలువురు నాయకులను గన్నవరపు సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు

మామిడికుదురు: ఉపాధ్యాయులకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు డిమాండ్ చేశారు. మామిడికుదురులో ఈలి శ్రీనివాస్ స్వగృహంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమోషన్లు లేకుండానే ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారని వాపోయారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. రెండు నెలల తరువాత దశల వారీగా ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దీపాటి సురేష్‌బాబు, యాళ్ల పల్లంరాజు, చప్పిడి వెంకటేశ్వరరావు, వై.పద్మనాభం, అడబాల సుబ్బారావు, యెరుబండి సత్యనారాయణ పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో శుక్రవారం ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనకు, అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్‌స్వామి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు.

సమష్టి కృషితో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి



కేశవదాసుపాలెంలో వైఎస్సార్ సీపీ నూతన కార్యవర్గంతో నాయకులు

సఖినేటిపల్లి: క్షేత్ర స్థాయిలలో కార్యకర్తలు, నాయకులు సంఘటిత కృషి ద్వారా కూటమి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కేశవదాసుపాలెంలో ఆ పార్టీ నూతన కార్యవర్గం ఎంపిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. రాజోలు ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సూచనలతో చంద్రశేఖర్ నిర్వహించిన పై ఎంపిక కార్యక్రమంలో అధ్యక్షుడిగా యెనుముల చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శిగా జిల్లెళ్ళ చంద్రశేఖర్ ఎన్నుకున్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రుద్రరాజు చినరాజా, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు దొంగ ఏసు, జిల్లా కార్యదర్శి ఈద రవి రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రతినిధి తాడి సహదేవ్, లీగల్ సెల్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల చిట్టిబాబు, నాయకులు యెనుముల త్రినాథ్, సింహాచలం, గుబ్బల రమేష్, జిల్లెళ్ల ఆనందరాజు, గన్నాబత్తుల సత్యనారాయణ, కుంపట్ల శ్రీను, కె.కుమార్ చిట్టిబాబు, ఓగూరి విజయరత్నం, కె.లాజర్ పాల్గొన్నారు.

శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు



సోంపల్లిలో వనువులమ్మ



కమ్మిరెడ్డిపాలెంలో తాళ్లమ్మ



కొత్తపేటలో బంగారమ్మ



అంబాజీపేటలో కనకదుర్గమ్మ

కొత్తపేట: స్థానిక గ్రామదేవత బంగారమ్మ, కమ్మిరెడ్డిపాలెం గ్రామదేవత తాళ్లమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరి మాతలుగా దర్శనమిచ్చారు. ఆషాఢమాసం, అష్టమి తిథి, శుక్రవారం పురస్కరించుకుని ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవార్లను కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రాజోలు: శాకంబరి అలంకరణతో ఉన్న సోంపల్లి గ్రామదేవత వనువులమ్మ వారిని శుక్రవారం భక్తులకు దర్శించుకున్నారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని 180 కేజీల 17 రకాల కాయగూరలతో అమ్మవారిని భక్తులు అలంకరించారు.

అంబాజీపేట: స్థానిక వీరభద్ర థియేటర్ సమీపంలో బండారువారిపాలెంలో వేంచేసిన విజయ కనకదుర్గ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

రావులమ్మకు ప్రత్యేక కుంకుమ పూజలు

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన రావులమ్మ ఆలయంలో నిర్వహించిన కుంకుమ పూజలు భక్తులను విశేషంగా ఆలరించాయి. ఆషాఢ అష్టమి విశిష్టతను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 250 కేజీల బరువైన 58 రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ



అప్పనపల్లిలో కనకమహాలక్ష్మమ్మకు



పుల్లేటికుర్రులో బూరుగులమ్మకు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ఆషాఢం సారె సమర్పించారు. 70 కిలోల స్వీట్లు, పలు రకాల పండ్లు, పువ్వులు, గాజులు, చలివిడి తదితర రకాలను మేళతాళాలు, భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అనంతరం సారెను సమర్పించారు.

అంబాజీపేట: పుల్లేటికుర్రులో వేంచేసిన గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారికి భక్తులు ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం సారెను సమర్పించారు. సుమారు 100 రకాల పిండి వంటలతో కూడిన సారె సమర్పించారు.

కాలభైరవునికి ప్రత్యేక పూజలు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన కాలభైరవస్వామికి ఆలయ ప్రధానార్చకుడు అన్నప్పసోమయాజుల ఆధ్వర్యంలో అష్టమి పర్వదినం సందర్భంగా కాలభైరవునికి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. గారెలు మాలతో స్వామిని అలంకరించారు. అష్టమి సందర్భంగా స్వామికి విశేష పూజలు చేయడం వల్ల భక్తులు కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకమున్నారు. ప్రతి నెలా అష్టమి పూజలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డొక్కా సీతమ్మ సేవా సమితి కార్యక్రమాలు



కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

కొత్తపేట: డొక్కా సీతమ్మ సేవా సమితి సేవలు నిరుపమానమని లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ కృష్ణ అన్నారు. డొక్కా సీతమ్మ సేవా సమితి మూడో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మధ్యాహ్నం రోగులు, వారి సహాయకులు, సిబ్బంది సుమారు 170 మందికి, నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా రావులపాలెంలో 50 మందికి, రావులపాలెం బ్రైట్ లైట్ అంధుల పాఠశాలలో ఉన్న అంధులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం రావులపాలెం మండలం ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమంలో ఉన్న చెవుడు, మూగ, మానసిక దివ్యాంగులతో కేక్ కటింగ్ చేయించి వారికి స్నాక్స్, అల్పాహారం వితరణ చేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలిలో అనూస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడపబడుతున్న అన్నపూర్ణ డే కేర్ సెంటర్‌లో ఉన్న సుమారు 50 మంది వృద్ధులకు, పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, దుప్పటి, గొడుగు, పాదరక్షలు, సబ్బులు, పేస్టు బ్రష్ వంటి వస్తువులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. గత ఎనిమిదేళ్లుగా నిరంతరాయంగా స్వయంగా వండి పేదవాడి ఆకలని తీరుస్తున్న అనూస్ సంస్థ కోశాధికారి కాశీ అన్నపూర్ణ దంపతులను డొక్కా సీతమ్మ సేవ జాతీయ పురస్కారంతో డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి వల్లెం రాజేష్, సెక్రటరీ పిల్ల నాగశ్రీదేవి, సభ్యులు చిలువూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తరహాలో కంపార్ట్‌మెంట్ల ఏర్పాటుకు ప్రణాళిక



వాడపల్లి క్షేత్రంలో జలప్రసాదం కూలర్ ప్రారంభిస్తున్న చక్రధరరావు

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల, షిర్డీ తరహాలో కంపార్ట్‌మెంట్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు దేవదాయ-ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. భక్తుల నుంచి సమస్యలను, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో డీసీ చక్రధరరావు ఈ అంశాన్ని వెల్లడించారు. భీమవరం నుంచి మురళి అనే భక్తుడు చేసిన ఫోన్ కాల్‌కు స్పందించిన సందర్భంలో ఆయన ఈ అంశాన్ని తెలిపారు. సుప్రభాత సేవకు సంబంధించి పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు జవాబుగా ప్రతి శనివారం సుప్రభాత సేవ టికెట్లు ముందు ఆదివారం ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో ఉంచుతామని తెలిపారు. గతవారం రూ.200 టికెట్లు తీసుకున్న భక్తుల రద్దీ అధికంగా ఉండడం గమనించి మరిన్ని క్యూలైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం వచ్చే లక్షలాది భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, చిన్న పిల్లలకు పాలు సమకూరుస్తున్నామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చల్లని శుద్ధజలం అందుబాటులో జల ప్రసాదం కూలర్లను డీసీ శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు.

ఉపాధి పనుల్లో రూ.4.60 కోట్ల అవకతవకలు



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నివేదికను పరిశీలిస్తున్న పీడీ మధుసూదన్ తదితరులు

అయినవిల్లి: 2024-25 సంవత్సరానికి ఉపాధిహామీ పనుల్లో రూ.4.60 కోట్లు అవకతవకలు జరిగినట్లు తనిఖీల్లో తేలిందని డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ సామాజిక తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక సమావేశం శుక్రవారం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. డ్వామా పీడీ మధుసూదన్ మాట్లాడుతూ మండలంలోని 2024-25 సంవత్సరానికి 929 పనులు జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించినట్లు తెలిపారు. రూ.12.45 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో మెటీరియల్ నిమిత్తం రూ.3.11 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. శానపల్లిలంకలో సంతకాలు, వేలిముద్రలు లేకుండా కూలీల వేతనాలు జమ చేసినట్లు తెలిపారు. అలాగే మడుపల్లిలో దేవి గ్రూప్ సభ్యులు పంటబోదెలో పూడిక తీయలేదని ఓ రైతు సామాజిక తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఎంబుక్, సంతకాలు, వేలిముద్రలు, ఈసీ, చెక్ మేజర్ లేకుండా పశువుల షెల్టర్లకు రూ.67 లక్షలు లబ్ధిదారులకు జమ చేసినట్లు తనిఖీల్లో తేలిందన్నారు. శానపల్లిలంక, మాగం, చింతనలంక, వెలువలపల్లి గ్రామాల్లో పలువురు రైతులు జామ, బత్తాయి మొక్కలు వేయకుండానే బిల్లులు చెల్లించినట్లు చూపించారన్నారు. మరికొన్ని చోట్ల నాసిరకం మొక్కలు వేశారు. మరి కొన్ని చోట్ల మొక్కలు వేయకుండానే చనిపోయినట్లు రికార్డు చేశారన్నారు. పంట బోదెల్లో మట్టి పనులు చేసినట్లు చూపించారన్నారు. మరి కొన్ని చోట్ల పంటబోదెల్లో పూడిక తీసినట్లు కనీసం ఆనవాళ్లు కూడా లేవన్నారు. అలాగే కొన్ని కొబ్బరితోటల్లో పళ్లేలు తవ్వినట్లు చూపించారని వాటి ఆనవాళ్లు కూడా లేవన్నారు. పూర్తి స్థాయిలో నివేదికలను పరిశీలించిన పిదప అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోవరరావు, ఏపీడీ సత్యనారాయణ, అంబుడ్స్‌మన్ అడపా వెంకట శ్రీనివాస్, ఎస్ఆర్పీ వెంకటేశ్వరరావు, ఏపీఓ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వంతుల వారీ విధానం ద్వారా సాగు నీరందించాలి

పి.గన్నవరం: కొన్ని పంట కాలువల శివారు ప్రాంతాలకు సాగు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వర్షాలు పడేవరకూ అవసరమైతే వంతుల వారీ విధానంలో నీరందించాలని సాగునీటి సంఘాలకు ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ సూచించారు. పి.గన్నవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం గోదావరి సెంట్రల్ డెల్టా పరిధిలోని 56 నీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో కాలువల శివారు ప్రాంతాలకు నీరందడం లేదని పలువురు నీటిసంఘాల అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఎస్ఈ మాట్లాడుతూ గత 7 ఏడేళ్లుగా పంట కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ ఈఈ కాశి వెంకటేశ్వరరావు, డ్రైన్స్ ఈఈ శ్రీనివాస్, పి.గన్నవరం, అమలాపురం సబ్ డివిజన్‌ల డీఈఈలు నాగార్జున, పురుషోత్తం, కరుటూరి నర్సింహారావు, చొల్లంగి సత్తిబాబు, కాకర శ్రీనివాస్, దాట్ల వెంకట గోపాల్ రాజు, సీహెచ్ జగన్నాథం, దంగేటి వెంకటనాయుడు, సీహెచ్ సుబ్బరాజు, ఆకాశం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురం మండలం పేరూరుకు చెందిన మంత రామచంద్రరావు, వెంకటశ్రీలలిత పద్మజ దంపతులు రూ.10 వేలు అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను సత్కరించి, స్వామి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

బాడీ బిల్డింగ్‌కు ఎంతో ఆదరణ

రాజోలు: బాడీ బిల్డింగ్‌కు రాష్ట్రంలో ఎంతో ఆదరణ లభిస్తుందని ఆంధ్రబాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, జిమ్ కోచ్ షేక్ కాశిం అన్నారు. శుక్రవారం ఆయన పాదలాడలోని రియల్ జిమ్‌ను సందర్శించారు. కాశిం మాట్లాడుతూ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా యువత ఈ రంగంపై ఆసక్తి చూపుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అత్యాధునిక జిమ్‌లు ఏర్పాటు చేస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందన్నారు. వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం మన సొంతమవుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌ట్యాప్‌ల మోజులో పడి ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. జిమ్‌కు విచ్చేసిన కాశింకు రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సూరంపూడి త్రిమూర్తులు ఆధ్వర్యంలో జిమ్ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. సహాయ కార్యదర్శి కట్టా శ్రీను, వల్లూరి విజయ్‌కుమార్, రియల్ జిమ్ అధినేత సూరంపూడి రామకృష్ణ, కాండ్రేగుల రామకృష్ణ, తెన్నేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.13 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కూనపరెడ్డి రామకృష్ణ (65) సుగర్ ఎక్కువై ఒక కాలు తీసేశారు. సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో భార్యతో ఉంటున్నారు. కాలు లేకపోవడంతో పనికి వెళ్లలేక ఇంటి దగ్గరే ఉంటున్నారు. ప్రతి నెలా పింఛన్ డబ్బుతో ఇంటి అద్దె కట్టుకుంటూ, భార్యాభర్తలు మందులు కొనుక్కుని కుటుంబాన్ని పోషించుకోవాలి. ఈ పరిస్థితిలో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యులు గోపాలపురం రామకృష్ణ ఇంటికి వెళ్లి రూ.13 వేల చెక్కు సాయంగా అందజేశారు.

ఎక్సైజ్ వాహనాల వేలం వాయిదా

ఆలమూరు: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించాల్సిన వాహనాల వేలం వాయిదా పడింది. ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 24న ఉదయం 11 గంటలకు వాయిదా వేశామన్నారు. అర్హత కలిగిన ఆసక్తి ఉన్న కక్షిదారులు ఎక్సైజ్ నిబంధనల మేరకు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

ఐక్యతతోనే గ్రామాభివృద్ధి

మలికిపురం: గ్రామస్తులంతా ఐకమత్యంతో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎస్ఎంఈలతో పాటు గ్రామంలో పీత పెంపకంపై యూనిట్ ఏర్పాటు గురించి, గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టడంపై సమీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ ఎలుమర్తి బాబూజీ, పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ నిబంధనలు విధిగా పాటించాలి

రావులపాలెం: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలతో పాటు డ్రైవింగ్ నిబంధనలను విధిగా పాటించాలని రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు అన్నారు. స్థానిక సీతారామ ఆటో యూనియన్ వద్ద శుక్రవారం ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ శేఖర్‌బాబు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, అలాగే ముందు సీట్లో ప్రయాణికులను ఎక్కించకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. డ్రైవర్లు లైసెన్సులు, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్లు, ఇన్సూరెన్స్‌లు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రావులపాలెం ఎస్సై కేవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రివిట్‌మెంట్ నిర్మాణానికి కార్యాచరణ



బ్యాంక్ ఆఫ్ బరోడా సీఎస్‌సీ బ్యాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్

మామిడికుదురు: గోదావరి కోత నివారణకు రివిట్‌మెంట్, గ్రోయిన్లు వంటి రక్షణ చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టానని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ తెలిపారు. ఆయన పాశర్లపూడిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా బిజినెస్ కరస్పాండెంట్ పాయింట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సహకారంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి ఈ సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఓడలరేవులో కేంద్రీయ విశ్వ విద్యాలయం, రాజోలులో నవోదయ స్కూల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, బీఓబీ మేనేజర్ జె.రాజా, సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, యాళ్ల అనికుమారి, మాజీ ఎంపీటీసీ చుట్టుగుళ్ల కిశోర్, తులా బ్రహ్మాజీ, మేడేపల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.